క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్ర'లో పేర్లను నమోదు చేసుకోండి

మైదుకూరు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఆటలు పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎంఈఓ టీఎం పద్మలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు పురపాలక సంఘం పరిధిలోని 11 సచివాలయ పరిధిలోని 18 సంవత్సరాలు నిండి, మైదుకూరు వాస్తవ్యులైన వారు ఈ ఆటల్లో పాల్గొనాలని ఎంఈఓ పేర్కొన్నారు. క్రికెట్‌కు 15 మంది, బ్యాడ్మింటన్‌కు ఐదు మంది, వాలీబాల్‌కు 6 మంది, ఖోఖోకు 15 మంది, కబడ్డీకి 15 మంది శుక్రవారం ఉదయం 11 గంటల లోపల మున్సిపల్ ఆఫీస్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని ఆయా శాఖల అధికారులతో శుక్రవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. నియోజకవర్గ స్థాయి సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

13న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రొద్దుటూరు : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 13న స్థానిక రోటరీ ఐ ఆస్పత్రిలో రోటరీ ట్రస్టు, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. నవసమాజ నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. శనివారం సాయంత్రంలోపు ఆసక్తిగల విద్యార్థులు 9440074868, 9849354729 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు అయ్యవారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అయ్యవారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద విలేజ్ క్లినిక్ వద్ద ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామని, సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

నేటి నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం

ప్రొద్దుటూరు : పాలిసెట్–23 పరీక్షలో ఉత్తీర్ణులై సర్టిఫికెట్ పరిశీలన పూర్తయిన విద్యార్థులకు ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చునని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసీహెచ్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో వెబ్ ఆప్షన్ ఇచ్చుకునే సదుపాయం ఉచితంగా కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని వివరించారు. వివరాలకు కె.శేషయ్య బాబు సెల్ నంబర్ 99594 20645, ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు సెల్ నంబర్ 99123 42022కు సంప్రదించాలని కోరారు.

12న ఫ్యాప్టో నిరసన

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు విద్యారంగ పరిరక్షణ కోసం ఈ నెల 12వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయ్‌కుమార్ కోరారు. గురువారం కడప యూటీఎఫ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయులను పనిగట్టుకొని వేధిస్తున్నారని అన్నారు.

14న ఆందోళన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈనెల 14న అర్హులైన పేదలకు సాగు భూములను అందించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. బడాబాబులు ప్రభుత్వ భూములకు తప్పుడు రికార్డులను సృష్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

27న ముస్లిం ఐక్యవేదిక సమావేశం

కడప రూరల్ : ఈనెల 27న గుంటూరులో నిర్వహించే ముస్లిం ఐక్య వేదిక సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ వేదిక నేతలు అబ్దుల్ కలాం, సయ్యద్ సలావుద్దీన్, అబ్దుల్ అజీజ్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలు సమావేశాలు నిర్వహించామన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రొద్దుటూరు : ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన వైఎస్‌ఆర్ పట్ల వారు కృతజ్ఞతాభావంతో ఉన్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జామియా మసీదులోని ఖబరస్థాన్‌లో రూ.65 లక్షలతో చేపట్టనున్న సిమెంటు రోడ్ల నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 4 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతో ముస్లింలు వైఎస్‌కు అండగా ఉంటూ వచ్చారని, అదే కృతజ్ఞతా భావంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి ప్రధాన భూమిక పోషించారన్నారు. అదే తరహాలో సీఎం జగన్ ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. చాలా ఏళ్లు పరిపాలించిన టీడీపీ నాయకులు ఖబరస్థాన్ అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. అందరం ఒక నాటికి ఖబరస్థాన్‌కు చేరాల్సిందేనని, అంతటి పవిత్రమైన స్థలాన్ని అభివృద్ధి చేయడంలో వారు నిర్లక్ష్యం వహించారన్నారు. గతంలో తాను పలు మార్లు మసీదుకు రావడం జరిగిందని, ఖబరస్థాన్‌ను కూడా పరిశీలించడం జరిగిందన్నారు. ప్రస్తుతం రూ.65 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు నియోజకవర్గాన్ని శాంతియుతంగా ఉంచడమే తన కర్తవ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రత్యర్థులు చేసే నిందారోపణలను తాను పట్టించుకోనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, వార్డు ఇన్‌చార్జి హిదాయత్, కౌన్సిలర్లు వడ్ల ఖలీల్, కమాల్, కోఆప్షన్ సభ్యులు మల్లికార్జున ప్రసాద్, కటిక జాఫర్, ముస్లిం మైనారిటీ నాయకులు వడ్ల దాదాపీర్, నూరి, కరీ ముల్లా, జుబేర్, జిలాన్, కింగ్ బాషా, ఎంపీపీ శేఖర్ యాదవ్, ఎంపీటీసీ మహబూబ్‌బాషా, పాలగిరి ఖాజా, మార్కెట్ ఖాసీం, సుభాన్ బాషా, అహ్మద్ హుస్సేన్, ముఫ్తి అబ్దుల్‌మాలిక్ తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ సందర్భంగా ముస్లింలతో కలసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

దివ్యాంగులకు స్కూటర్లు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సొంత నిధులతో నియోజకవర్గ పరిధిలోని నలుగురు దివ్యాంగులకు గురువారం స్కూటర్లను పంపిణీ చేశారు. నాలుగు స్కూటర్ల విలువ రూ.4.80 లక్షలుగా ఉంది. తమ జీవనోపాధికి కష్టంగా ఉందని చెప్పడంతో వారికి ఈ వాహనాలను కొనుగోలు చేసి ఇచ్చానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 17 మందికి కలిపి రూ.17,05,000 అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్‌యాదవ్, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు స్కూటర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

సంక్షేమం అందిస్తూ.. అభివృద్ధి చేస్తూ..

ఖాజీపేట : ఒక వైపు సంక్షేమ పథకాలతో పేదలకు అండగా ఉండటమే కాకుండా పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తూ ప్రగతి వైపు రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. పత్తూరు పంచాయతీలోని ధాంఖాన్‌పల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రఘురామిరెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను చదివి వినిపించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారించాలని అధికారులకు ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వాటిని పరిష్కరించేందుకు తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అర్హత ఉండి ఇళ్లు కట్టుకునే ప్రతి ఒక్కరికి స్థలాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మంచి సేవలు అందుతున్నాయని తెలియజేశారు. గతంలో లాగా విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. పంట నష్టపరిహారం కూడా రైతులకు సకాలంలో అందుతోందని చెప్పారు. పండిన పంటలకు గిట్టుబాటు ధరతో ప్రభుత్వం కొని రైతులకు అండగా ఉంటోందన్నారు. గ్రామాల అభివృద్ధితోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పిస్తున్న ఖ్యాతి సీఎం జగన్‌కే దక్కాలన్నారు. ప్రజల్లో ఎక్కడికి వెళ్లినా మంచి ఆదరణ లభిస్తోందని అన్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సర్పంచ్‌లు గడ్డం రేణుక, పెద్దిరెడ్డి, ఎంపీటీసీ రాముడు, నాగేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, జి.మునలయ్య, జి.రామకృష్ణతోపాటు మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

జెడ్‌హెచ్‌డీసీ భూములకు పట్టాలివ్వాలని ధర్నా

పోరుమామిళ్ల : మండలంలోని చల్లగిరిగెల పంచాయతీలోని జెడ్‌హెచ్‌డీసీ భూముల లబ్ధిదారులకు పట్టాలిచ్చి ఆన్‌లైన్ చేయించాలని గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్య.కా. సం. జిల్లా కార్యదర్శి అన్వేష్, ఉపాధ్యక్షులు వీరయ్య మాట్లాడుతూ 2005లో జెడ్‌హెచ్‌డీసీ భూములను దళితులకు 2 ఎకరాల చొప్పున పంపిణీ చేశారని వాటికి ఇంత వరకు పట్టాలు ఇవ్వలేదన్నారు. అప్పటి నుంచి భూములు సాగు చేసుకుంటున్నవారు పన్ను చెల్లిస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వ సదుపాయాలు రైతుభరోసా, పంటల బీమా, నష్టపరిహారం తదితరాలు పొందేందుకు ఆ భూములకు లబ్ధిదారుల పేరుతో పట్టాలిచ్చి ఆన్‌లైన్ చేయాలన్నారు. భూములను సబ్‌డివిజన్ చేసి హద్దులు చూపాలని కోరారు. బోర్లు వేసి కరెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో భూముల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

పండుగలా నా మట్టి – నా దేశం కార్యక్రమం

గోపవరం : మట్టికి ప్రమాణాలు, వీరులకు వందనాలు, దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులకు అంకితం చేస్తూ నిర్వహిస్తున్న నా మట్టి – నా దేశం కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించిందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ అన్నారు. గురువారం మండలంలోని బేతాయపల్లె, ఎస్.రామాపురం, బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీల్లో నా మట్టి – నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు వందనం, ప్రతిజ్ఞ, వీరజవానులకు సన్మానాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్ని సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, సర్పంచ్‌లు లక్ష్మీదేవి, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


గోపవరంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న అధికారులు, ప్రజలు

ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన

గోపవరం : మండలంలోని అడుసువారిపల్లెలో మాజీ జెడ్పీటీసీ దివంగత రాచపూడి నాగభూషణం జ్ఞాపకార్థంగా గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బద్వేలు మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్ సాయిదిలీప్‌గుప్తలు ముఖ్యఅతిథులుగా హాజరై పాడిరైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 25 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 52 దూడలకు నట్టల నివారణ మందులు, 22 పశువులు, 72 గొర్రెలు, 68 మేకలకు సాధారణ చికిత్సలను పశువైద్యాధికారులు క్రిష్ణవేణి, నరసింహారెడ్డిలు నిర్వహించారు.


ఉచిత మందులు పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారులు

డ్వాక్రా మహిళలకు ఆటల పోటీలు

పోరుమామిళ్ల : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు 3 రోజులు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని వైస్ ఎంపీపీ-1 సీఎం బాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డిలె తెలిపారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు బహుమతులు ఇస్తామన్నారు. గురువారం మండల కాంప్లెక్స్ ఆవరణలో డ్వాక్రా మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలను ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టేకూరుపేట, పుల్లివీడు సర్పంచులు కల్లూరు రమణారెడ్డి, రఘునాథరెడ్డి, ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


పోటీలలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

విద్యార్థులను రోజూ పాఠశాలకు పంపించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులను రోజూ పాఠశాలకు పంపించాలని వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాశీ ప్రసాద్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజేశ్వరి తెలిపారు.

గురువారం పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాలలో జగనన్న గోరుముద్ద పౌష్టికాహారం అందిస్తున్నామని, రోజూ పాఠశాలలోనే భోజనం చేయాలన్నారు. జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి తదితర పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్‌ఏ-1 పరీక్షా ఫలితాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వారు ఏఏ పాఠ్యాంశాల్లో వెనుకబడి ఉన్నారో వివరించారు.

దారి కోసం ఘర్షణ

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని కేకే స్ట్రీట్‌లో ఉన్న టౌన్‌బ్యాంక్ లైన్‌లో దారి కోసం ఘర్షణ జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు .. పెన్నానగర్‌కు చెందిన జోసఫ్‌తో పాటు కొందరు బుధవారం రాత్రి బేల్దారి పని చేసేందుకు టౌన్‌బ్యాంక్ లైన్ వీధిలోకి వెళ్లారు. వారు పని చేస్తున్న సమయంలో ఇక్కడ దారి లేదని, పని చేయొద్దంటూ పక్కనే ఉన్న చంద్రశేఖర్ అభ్యంతరం తెలిపాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తనపై పెట్రోల్ పోసి దాడి చేశారని చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు జోసఫ్‌తో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పని చేస్తున్న మేస్త్రీ మార్క్‌ను కులం పేరుతో దూషించినందుకు చంద్రశేఖర్‌తో పాటు మరి కొందరిపై వన్‌టౌన్ పోలీసులు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. మార్క్ బేల్దార్లతో పని చేయిస్తుండగా ఈ స్థలం తమదని ఇక్కడ ఎందుకు పని చేస్తున్నారని చంద్రశేఖర్ అభ్యంతరం తెలిపాడు. స్థలానికి సంబంధించిన యజమాని చెప్పడంతో పని చేస్తున్నామని మేస్త్రీ మార్క్ తెలిపాడు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చంద్రశేఖర్ తమను కులం పేరుతో దూషించాడని మార్క్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చంద్రశేఖర్‌తో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం

కడప అర్బన్: కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవీధికి చెందిన తిరుమలశెట్టి వెంకటరమణ తన భార్య శివమల్లేశ్వరి, ముగ్గురు పిల్లలు శ్రీనిధి (7), యశ్వంత్ (5), ప్రణవి (3)లతో కలిసి ఈనెల 4వ తేదీన దుస్తులు తీసుకుని వెళ్లిపోయిందని గురువారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. తన భార్య శివమల్లేశ్వరి రిలయన్స్ జియో సంస్థలో కాల్‌వర్కర్‌గా పనిచేస్తోందని, ప్రతి రోజూ ఉదయం 9గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాత్రి వస్తుంది. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు పెరుగుతున్నాయన్నారు. ఈనెల 4వ తేదీన శివమల్లేశ్వరి తన పుట్టింటికి వెళ్లింది. తిరిగి వచ్చి దుస్తులను తీసుకుని ఎవరూలేని సమయంలో పిల్లలతో సహా వెళ్లిపోయిందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ వేడుకలు

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లె, పెండ్లిమర్రి, మహానందిపల్లె గ్రామ పంచాయతీల్లో గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయాల వద్ద మొక్కలు నాటి మాజీ సైనికులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న నా భూమి – నా దేశం, నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ పి.పురుషోత్తంరెడ్డి, ఈఓపీఆర్‌డీ మురారి, ఏపీఓ రవీంద్రారెడ్డి, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మహానందిపల్లెలో మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

వార్డు ఎన్నికకు రెండు నామినేషన్లు దాఖలు

గోపవరం : మండలంలోని కాలువపల్లె 8వ వార్డు ఎన్నికకు సంబంధించి గురువారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. పందీటి సుజాత, కమలాపురం భాగ్యమ్మలు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. గతంలో 8వ వార్డు మెంబర్‌గా ఉన్న కమలాపురం బాలఓబయ్య మృతి చెండటంతో ఎన్నిక అనివార్యమైంది. శుక్రవారం నామినేషన్ల పరిశీలన, శనివారం ఉపసంహరణ ఉంటుందన్నారు.

కొత్తపల్లె వార్డు మెంబర్‌కు 12 నామినేషన్లు

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న 13వ వార్డు స్థానానికి గురువారం మొత్తం 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, బలిమిడి గురుస్వామి, అవుల పెద్ద దస్తగిరి, పేరం బ్రహ్మానందం రెడ్డి, కొత్తపల్లె రమణ తదితరులు నామినేషన్లు వేశారు. అలాగే తాళ్లమాపురం గ్రామ పంచాయతీలో ఒకటో వార్డుకు బడుగు శ్రావణి, పసుపుల లక్ష్మినారాయణమ్మ నామినేషన్లు వేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ శశిధర్ రెడ్డి నామినేషన్లను స్వీకరించారు.

4 వార్డులకు ముగిసిన నామినేషన్లు

కాశినాయన : మండలంలోని ఉప్పలూరు, కొండ్రాజుపల్లె, గంగనపల్లె–2 గ్రామ పంచాయతీల్లోని ఖాళీగా ఉన్న 4 వార్డులకు గురువారం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. 4 వార్డులకు నలుగురు నామినేషన్లు వేశారు. ఈ వార్డులు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులే ఏకగ్రీవం కానున్నాయి. శనివారం అధికారికంగా ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు.

మైదుకూరులో..

మైదుకూరు : మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లె పంచాయతీలో ఖాళీగా ఉన్న వార్డు సభ్యురాలు ఎన్నికకు చివరి రోజైన గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పంచాయతీకి చెందిన కొండిశెట్టి స్వప్న, కోటయ్యగారి మహాలక్ష్మి, బండి గురు ప్రసన్నలు తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఎం.సుధాకర్‌కు అందజేశారు. వారి నామినేషన్లను 11వ తేదీ పరిశీలిస్తారు. 14వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగా, 19వ తేదీన తిప్పిరెడ్డిపల్లెలోని ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కించి ఫలితాన్ని ప్రకటిస్తారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న పందీటి సుజాత

అల్‌బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ

ప్రొద్దుటూరు క్రైం : అల్‌బెండజోల్ మాత్రలతో నులి పురుగులను నివారించవచ్చని ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా పట్టణంలో ఉన్న కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లోని పిల్లలకు గురువారం అల్‌బెండజోల్ మాత్రలను అందచేశారు. గీతాశ్రమంలోని జీవనజ్యోతి స్కూల్‌లో నులిపురుగులు ఎలా వ్యాపిస్తాయి, హ్యాండ్ వాష్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హాజిరా, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

వైఎంఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో..

స్థానిక వైఎంఆర్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ హిమబిందు ఆధ్వర్యంలో 182 మంది విద్యార్థులకు అల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో ఎన్‌డీడీ మానిటరింగ్ అధికారులు డాక్టర్ అనూష, జమీర్, రామ్మూర్తిలు పిల్లలచే మాత్రలను మింగించారు. కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, హెల్త్ సెక్రటరి జ్యోతి పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ పరిధిలో

కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని దొరసానిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అల్‌బెండజోల్ మాత్రలను అందచేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, అప్తాల్మిక్ అధికారి తేజ పాల్గొన్నారు.

రాజుపాళెం : అల్‌బెండజోల్ మాత్ర మింగడం వల్ల విద్యార్థుల్లో ఉండే నులిపురుగులు నశిస్తాయని పీహెచ్‌సీ వైద్యురాలు నిఖిల అన్నారు. రాజుపాళెంలోని పాఠశాలలో గురువారం విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓలు శివశంకర్ రెడ్డి, రవిశంకర రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు క్రైం : విద్యార్థులచే అల్‌బెండజోల్ మాత్రలను మింగిస్తున్న డాక్టర్ హిమబిందు


బద్వేలు : విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు వేస్తున్న ఎంఈఓ, వైద్యాధికారులు

నులి పురుగుల నిర్మూలనతో చిన్నారుల్లో ఎదుగుదల

చాపాడు : పిల్లల్లో నులి పురుగులను నిర్మూలించడం వలన వారిలో ఎదుగుదల ఉంటుందని జిల్లా ప్రోగ్రామ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్ రెడ్డి పేర్కొన్నారు.

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అల్‌బెండజోల్ ట్యాబ్లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీపీఎంఓ మాట్లాడుతూ నులి పురుగుల నిర్మూలనతో పిల్లల్లో ఎదుగుదల పరిపుష్టిగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని పిల్లలతో పాటు అంగన్‌వాడీ విద్యార్థులకు వైద్య సిబ్బంది అల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. మండల వ్యాప్తంగా 6700 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రతి విద్యార్థి చేత ఈ మాత్రలను తినిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ రమేష్‌రెడ్డి, మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఓబులేసు, సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎన్‌ఎం స్రవంతి, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల దినోత్సవం

దువ్వూరు : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్‌బాబు, సమీర పేర్కొన్నారు. మండలంలోని పుల్లారెడ్డిపేటలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఒక సంవత్సరం 19 ఏళ్ల పిల్లల వరకు అల్‌బెండజోల్ 400 ఎంజీ మాత్రలు తినిపిస్తే పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరిగి నులిపురుగుల ప్రభావం ఉండదని డాక్టర్లు తెలిపారు. మండలంలో 9,614 మంది విద్యార్థులు ఉండగా గురువారం 9,313 మందికి అల్బెండజోల్ మాత్రలు వేశామన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారి మల్లేశ్వరి, ఆరోగ్య విస్తరణ అధికారి మురళి, సిబ్బంది సువర్ణ, శ్రావణి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అల్‌బెండజోల్ 400 ఎంజీ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్త హీనత, శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందన్నారు. విద్యార్థులు పరిశుభ్రతను పాటించి నులిపురుగులు దరిచేరకుండా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యం

బద్వేలు అర్బన్ : ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఇందుకోసం రేపటి భావిభారత పౌరులైన చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలని మండల విద్యాశాఖాధికారి ప్రమీల, తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జోత్స్నస్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్‌లు పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. అలాగే పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరీముల్లా, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్లు జనార్ధన్‌రావు, శ్రీరాములయ్య, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశినాయన : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. మండలంలో 5069 మంది పిల్లలు ఉండగా 4932 మందికి మాత్రలు మింగించినట్లు వైద్యాధికారి తెలిపారు. మిగిలిన 137 మంది పిల్లలకు ఈనెల 17వ తేదీన మింగిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనే ధ్యేయం

గోపవరం : నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లలు, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి నులిపురుగులను నివారించడానికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.